క్లుప్తంగా

విద్యార్థులకు ఆటల పోటీలు

కొవ్వూరు: ఉగాది సంబరాల్లో భాగంగా మన సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 22న పట్టణంలో మున్సిపల్ హైస్కూలులో సాయంత్రం మూడు గంటలకు విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంఘ కార్యదర్శి యాళ్ల మార్కండేయులు తెలిపారు. గురువారం కాకతీయ ప్లాజా వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడంలో భాగంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పాటలు, ఆటలు, రంగవల్లులు తదితర పోటీలు నిర్వహించి విజేతలతో పాటు పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేస్తామన్నారు. రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని తెలిపారు.

ఆర్‌బీకేల్లో ఈ–పంట నమోదు జాబితా



ఆవపాడు రైతు భరోసా కేంద్రంలో రైతుల జాబితాలు ప్రదర్శిస్తున్న ఏఓ

నల్లజర్ల: మండలంలో ఈ–పంట నమోదు కార్యక్రమం పూర్తయిందని, రైతుల పేర్లతో జాబితా తయారు చేసి రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్టు మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. రైతులు జాబితాలు పరిశీలించి, తమ పేర్లు లేనట్టయితే వ్యవసాయ సహాయకుల దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యవసాయశాఖ అందించే అన్ని రాయితీలకు ధాన్యం అమ్మకానికి, పంట నష్టంలో కూడా ఈ పంట నమోదు తప్పనిసరి అన్నారు.

ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

కొవ్వూరు: పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ చేస్తూ చైతన్య కళాశాలకి చెందిన ఒక విద్యార్థి స్క్వాడ్‌కి పట్టుబడినట్టు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. గురువారం ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్ష నిర్వహించారు. మాల్ ప్రాక్టీస్‌లో పట్టుబడిన విద్యార్థిని ఇంటర్మీడియెట్‌లో ఇతర పరీక్షలకు అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న 15 పరీక్ష కేంద్రాల్లో 4,778 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా వీరిలో 4,684 మంది హాజరయ్యారు. డివిజన్ వ్యాప్తంగా 94 మంది గైర్హజరయ్యారు. జనరల్ కేటగిరిలో 4,097 మందికి గాను 59 మంది గైర్హజరు కాగా 4,038 పరీక్షలు రాశారు. ఒకేషనల్‌కి 681 మందికి 35 మంది గైర్హజరయ్యారు. కొవ్వూరు చైతన్య కళాశాలలోని పరీక్ష కేంద్రానికి 233 మంది విద్యార్థులను కేటాయించగా వీరిలో ముగ్గురు గైర్హజరయ్యారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 261 మందికి నలుగురు విద్యార్థులు గైర్హజరయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు: దేచెర్లలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి వివిధ ఫీడర్లలో వార్షిక పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ కోత ఉంటుందన్నారు. ఐ.పంగిడి ఇండస్ట్రీరియల్ ఫీడర్, దేచెర్ల, ధర్మవరం 11కేవీ ఫీడర్ పరిధిలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

భూముల రీ సర్వేపై సమావేశం

తాళ్లపూడి: మండలంలో జరుగుతున్న రీ సర్వే మరింత వేగంగా నిర్వహించాలని వలంటీర్లు తమ వంతు సహకారం అందజేయాలని తహసీల్దార్ టి.రాధిక తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం గ్రామ వలంటీర్లు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాధిక మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందని, వలంటీర్లు తమ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు.

దళిత హక్కుల కోసం గర్జిద్దాం

నల్లజర్ల: దళిత హక్కుల కోసం గర్జిద్దామని మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు అలగ రవికుమార్ పిలుపునిచ్చారు. మండల శాఖ అధ్యక్షుడు బి.గణేష్ అధ్యక్షతన దూబచర్ల గాంధీకాలనీలో గురువారం సాయంత్రం సమావేశం జరిగింది. దళిత హక్కుల సాధన కోసం మే 14వ తేదీన ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో లక్ష మందితో దళిత గర్జణ సభ నిర్వహిస్తున్నట్టు రవికుమార్ వెల్లడించారు. ఆ కార్యక్రమానికి జన సమీకరణకు గ్రామాల్లో సభలు నిర్వహించి చైతన్యం తీసుకువస్తున్నట్టు వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దేవరపల్లి: సూర్యనారాయణపురం వద్ద మంగళవారం జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో యర్నగూడెంకు చెందిన పోలుకొండ కృష్ణ(23) తీవ్రంగా గాయపడడంతో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ విజయదుందుభి

- ఎమ్మెల్సీలుగా కవురు, వంకా ఘన విజయం
- టీడీపీ, జనసేన, స్వతంత్రుల ఓట్లూ వైఎస్సార్ సీపీకే..
- చెల్లని ఓట్లు 25.. వీటిలో టీడీపీకి 20
- వాస్తవ బలానికి మించి 'ఫ్యాన్' ప్రభంజనం
- ముగ్గురు స్వతంత్రులకు ఒక్క ఓటూ దక్కని వైనం



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

కొవ్వూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని స్థానిక సంస్థల శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించింది. కనీసం ఒక స్థానం దక్కించుకోవడానికి సరిపడా ఓట్లు కూడా లేని తెలుగుదేశం పార్టీ ఉద్దేశపూర్వకంగానే ఎన్నికలకు తెర తీసింది. పర్యవసానంగా టీడీపీ వాస్తవ బలం కూడా తగ్గిపోయేలా పోలింగ్ జరగడం విశేషం. అత్యధికంగా 25 చెల్లని ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ ఘన విజయం సాధించారు. మొత్తం పోలైన 1,088 ఓట్లలో దాదాపు 90 శాతం వీరిద్దరే మొదటి ప్రాధాన్యతలో దక్కించుకున్నారు.

1,088 ఓట్లు

జిల్లాలో ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 13న పోలింగ్ జరగ్గా.. గురువారం ఉదయం ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలోని కౌంటింగ్ సెంటర్‌లో ఐదు టేబుళ్ల ద్వారా ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొత్తం 1,105 ఓట్లు ఉండగా నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్సీలు మంతెన సత్యనారాయణరాజు, షేక్ సాబ్జీతో పాటు మరో 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. దీంతో మొత్తం 1,088 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, తెర పైకి టీడీపీ అభ్యర్థి, తెర చాటున టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా వీరవల్లి చంద్రశేఖర్ పోటీ చేశారు.

ఐదు టేబుళ్లపై..

ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ 9.30 గంటలకే ముగిసింది. పోలైన ఓట్లలో 25 చెల్లుబాటు కాలేదు. మొదటి టేబుల్‌లో 2, రెండో టేబుల్‌లో 8, మూడో టేబుల్‌లో 4, నాలుగో టేబుల్‌లో 4, ఐదో టేబుల్‌లో 7 కలిపి 25 ఓట్లు చెల్లుబాటు కాలేదని అధికారులు ప్రకటించారు. మిగిలిన 1,063 ఓట్లలో మొదటి మూడు టేబుళ్లలో 200, 4వ టేబుల్‌లో 250, ఐదో టేబుల్‌లో 230 ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో మొదటి రౌండ్ లోనే వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కవురుకు 481, వంకాకు 460 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు 122 ఓట్లు దక్కాయి. టీడీపీకి సానుభూతిపరులుగా ఉంటూ స్వతంత్రులుగా బరిలో నిలిచిన గోరింక దాసు, దేవరల్లి ఆదాం, పసల వెంకటాచలంకు ఒక్క ఓటు కూడా రాలేదు.

50 ఓట్లు అధికంగా 'ఫ్యాన్'కు

వాస్తవానికి వైఎస్సార్ సీపీకి 891 ఓట్లు, టీడీపీ, జనసేనకు కలిపి 192 ఓట్లు మిగిలినవి స్వతంత్రులు ఉన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు 941 ఓట్లు పోలయ్యాయి. ఈ లెక్కన వాస్తవానికి మించి 50 ఓట్లు అధికంగా వచ్చాయి. టీడీపీ, జనసేన అభ్యర్థికి 192 ఓట్ల బలం ఉండగా 122 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. చెల్లని 25 ఓట్లలో 20 ఓట్లు టీడీపీవి, 5 ఓట్లు సీపీవిగా చెబుతున్నారు. ఇక జనసేన, టీడీపీ ఓట్లు వైఎస్సార్ సీపీకి క్రాస్ అయ్యాయి. స్వతంత్రుల ఓట్లు కూడా అధికంగా వైఎస్సార్ సీపీకి పోలయ్యాయి. భారత ఎన్నికల సంఘం అనుమతితో కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలు అందించామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు.

ప్రతిపక్షాలకు చెంపపెట్టు



ప్రతిపక్షాలకు ఈ విజయం చెంపపెట్టు లాంటిది. వారు ప్రలోభాలకు గురి చేసినా న్యాయమే గెలిచింది. ఈ గెలుపు ప్రతిపక్షాలకు కనువిప్పు కలిగించాలి. ఇప్పటికైనా ప్రతిపక్షాలు ప్రజాసంక్షేమానికి మద్దతు తెలిపాలి. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటు పడుతున్నారు. ప్రజలు ప్రతిపక్షాల కుట్రలను గమనిస్తూనే ప్రభుత్వానికి నీరాజనాలు పలుకుతున్నారు. అన్ని ఎన్నికల్లోనూ ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారు.

– కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

అభివృద్ధి, సంక్షేమమే గెలిపించింది



ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి మా విజయానికి కారణమైంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు చేపట్టిన అభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టంకడుతున్నారు. ప్రజలు వైఎస్సార్‌సీపీ సర్కారుకు నీరాజనాలు పలుకుతున్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరు. సీఎం జగన్ పాలన చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి. ఈ గెలుపుతో ప్రతిపక్షాలు మార్పు చెంది ప్రజలకు మంచి చేసేందుకు సహకరించాలి.

– వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

ఇంటర్ రెండో ఏడాది పరీక్షలు ప్రారంభం

నల్లజర్ల: ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం నుంచి ప్రాంభమయ్యాయి. పరీక్ష సెంటర్లు నల్లజర్లలోని శశి, ఏకేఆర్జీ, ఎస్ఆర్‌కే కళాశాలల్లో 1123 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిం ఉండగా 32 మంది గైర్హాజరయ్యారు. తహసీల్దారు వర్ధనపు కిశోర్‌కుమార్ శశి కళాశాలలో పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 230 మంది విద్యార్థులకు గాను 219 మంది పరీక్ష రాశారు.

గృహ రుణాల మంజూరుకు చర్యలు

నిడదవోలు రూరల్: పట్టణంలోని సుబ్బారాజుపేటలో విద్యుదాఘాతం వల్ల ఇటీవల రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబాలకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆదేశాలతో తక్షణమే హౌసింగ్ లోన్ మంజూరుకు చర్యలు తీసుకున్నట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తెలిపారు. తాటాకిల్లు దగ్ధమైన ప్రాంతాన్ని భూపతి ఆదినారాయణ, హౌసింగ్ డీఈ ఎస్.చంద్రశేఖర్ గురువారం పరిశీలించి, బాధితులు కోడి బుజ్జి, కోడి గంగరాజు, నవీన్‌లతో మాట్లాడారు. కౌన్సిలర్ ఆలమూరి భారతి, చక్కా రమాదీప్తి ఆర్థిక సాయంతో బాధితులకు స్టీల్ వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేశారు. కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి సుప్రియ, అహ్మదున్నీషాబేగం, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు

కొవ్వూరు: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు అడ్మిషన్ల కోసం ఈనెల 18 నుంచి ఏప్రిల్ ఏడో తేదీ వరకూ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా స్వీకరించాలని ఎంఈవో జె.కెంపురత్నం తెలిపారు. రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్టు 12సీ ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రైవేటు పాఠశాలల్లో ఈ ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టామన్నారు. విద్యార్థుల పేరు, ఆధార్‌కార్డు, డే ఆఫ్ బర్త్, కుల ధృవీకరణ పత్రం తదితర వివరాలను నమోదుకి స్కూలు ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ సహకారం ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 9వతేదీ నుంచి 12వ తేదీ వరకూ విద్యార్థుల అర్హతలను నిర్ణయిస్తారన్నారు. ఏప్రిల్ 13న ఫస్ట్ రౌండ్ లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ స్కూళ్లలో అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. 25వ తేదీ నుంచి రెండో దశ లాటరీలో ఫలితాలను ప్రకటిస్తారన్నారు. 26 నుంచి 30వ తేదీ వరకు రెండో విడత అడ్మిషన్లు కొనసాగుతాయన్నారు. తల్లిదండ్రులకు ఏమైనా సందేహాలు, అనుమానా ఉంటే 14417 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేయాలని ఎంఈవో సూచించారు.

మృత్యువును జయించిన బాలిక

- మూడు నెలల తర్వాత స్పృహలోకి వచ్చిన విద్యార్థిని ఝాన్సీలక్ష్మి
- కుటుంబ సభ్యుల ఆనందం



స్పృహలోకి వచ్చిన విద్యార్థిని ఝాన్సీలక్ష్మితో కుటుంబ సభ్యులు

దేవరపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, దాదాపు మూడు నెలల పాటు మూసిన కన్ను తెరవకుండా రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన విద్యార్థిని రాపాక ఝాన్సీలక్ష్మి కోలుకుంది. మృత్యువుతో పోరాడి జయించి వచ్చిన విద్యార్థిని ఇప్పుడిప్పుడే కుటుంబ సభ్యులను గుర్తుపడుతోంది. తన బిడ్డను చూసి తల్లిదండ్రులు, అక్కచెల్లెలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... దేవరపల్లి మండలం ధుమందునిగూడెం పంచాయతీ పరిధిలోని సుబ్బరాయపురానికి చెందిన రాపాక ఝాన్సీలక్ష్మి కృష్ణపాలెంకు చెందిన మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో చదువుతోంది. గత ఏడాది నవంబరు 17న పాఠశాల నుంచి రోడ్డుపై ఇంటికి నడిచి వెళుతుండగా వెనుక నుంచి అతి వేగంగా బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ఝాన్సీలక్ష్మి తలకు బలమైన గాయం కావడంతో చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి పరిస్థితి విషయంగా ఉండడంతో ఖరీదైన వైద్యం అందించాలని వైద్యులు సూచించారు. విద్యార్థిని కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కాడడంతో తల్లిదండ్రులు సాయం కోసం దాతను ఆశ్రయించారు. వారి పరిస్థితి తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి తక్షణ సాయంగా రూ.5 లక్షలు మంజూరు చేయించారు. దీంతో పాటు ఆయన సొంతంగా రూ.50 వేలు అందజేశారు. అలాగే దాతలు స్పందించి తమ వంతు సాయం అందించారు. వైద్యానికి నిధులు సమకూరడంతో వైద్యులు ఝాన్సీలక్ష్మికి మెరుగైన వైద్యం అందించారు. దాదాపు మూడు నెలల పాటు కోమాలో ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యుల సూచనల మేరకు నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఝాన్సీలక్ష్మిని ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకువచ్చి సేవలు అందిస్తున్నారు. ఇటీవల స్పృహలోకి వచ్చి కుటుంబ సభ్యులను గుర్తించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే జ్ఞాపకశక్తి తక్కువగా ఉందని తండ్రి శ్రీను తెలిపారు. పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని వైద్యులు చెప్పారని, తన కూతురు తమకు దక్కుతుందని ఆనందపడుతున్నారు. రుణం మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, దాతలకు విద్యార్థిని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొవ్వూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్టు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు. పట్టణంలో ఏటిగట్టుపై ఉన్న కొవ్వూరమ్మ గుడి సమీపంలోని ఎన్‌టీఆర్ చిల్డ్రన్స్ పార్కు వద్ద తెల్లవారు జామున ఐదు గంటలకు వ్యక్తని గుర్తి తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అపస్మార స్థితికి చేరాడు. రాత్రి గస్తీలో ఉన్న పోలీసు సిబ్బంది 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఉదయం 7.15 గంటలకు మృతి చెందినట్టు వారు తెలిపారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదన్నారు. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. 08813– 231100, 94407 96622 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ



పురుషోత్తపల్లిలో మిడ్డేమీల్స్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

నిడదవోలు రూరల్: విద్యార్థులకు సులభ పద్ధతుల్లో బోధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సూచించారు. మండలంలోని పురుషోత్తపల్లి, సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ అబ్రహం మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకూ జరిగే పదోతరగతి పరీక్షలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, నిరంతరాయ విద్యుత్, రవాణా సదుపాయం కల్పిస్తామన్నారు. 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌ల పని తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారకు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులతో పాటు మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచికరంగా మెనూ ప్రకారం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఎంఈఓ డి.కిషోర్‌కుమా ర్, హెచ్ఎంలు డీఎస్‌వీఎస్ ప్ర సాద్, కె.జిలానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఈ–క్రాప్ తప్పనిసరి



ఆర్బీకేను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

తాళ్లపూడి: ప్రభుత్వం అందజేసే అన్ని పథకాలకు ఈ–క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. అన్నదేవరపేటలోని రైతు భరోసా కేంద్రంలో ఈ–క్రాప్ నమోదు జాబితాను గురువారం ఆయన నోటీష్ బోర్డులో పెట్టారు. వ్యవసాయ కమిషన్ ఆదేశాల మేరకు 2022 సీజన్‌లో చేసిన పంట నమోదు వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ–క్రాప్ నమోదుపై రైతులు తమ అభ్యంతరాలను గ్రీవెన్స్‌లో తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి జి.రుచిత తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ రైతులు పంట నమోదులో నమోదు చేసిన పంటల వివరాలను సరి చూసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ బోసుబాబు, కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు సతీష్, చాందిని, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పంపిణీ కేంద్రాల పనితీరు భేష్



ఉమ్మిడివారిపాలెంలో పుస్తక పంపిణీ కేంద్రాల రికార్డులను తనిఖీ చేస్తున్న శ్రీనివాసరావు

పెరవలి: జిల్లాలో గ్రంథాలయాలను, వాటి పరిధిలో పని చేసే పుస్తక పంపిణీ కేంద్రాల్లో గ్రంథాలయ తనిఖీ అధికారి వి.శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. మండలంలోని ఉమ్మిడివారిపాలెం, అన్నవరప్పాడు, ముక్కామల గ్రంథాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వలన 2020 నుంచి తనిఖీలు చేయడంలేదన్నారు. దీని వలన అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటి పరిష్కారం కోసం జిల్లా అంతా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. గత మూడేళ్ల రికార్డులను పరిశీలించి, వాటి స్థితిగతులు తెలిపేందుకు ఈ ఆడిట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ముక్కామల శాఖా గ్రంథాలయ పరిధిలో అన్నవరప్పాడు, ఉమ్మిడివారిపాలెం, ముత్యాలవారిపాలెం, గవర్లపాలెం పుస్తక పంపిణీ కేంద్రాలు ఉన్నాయని వీటి పనితీరు చాలా బాగుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎం.వెంకటేశ్వర్లు, యు.వెంకటేశ్వర్లు బీడీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల విజయంపై హర్షం





ఎమ్మెల్సీలు వంకా, కవురులను అభినందిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు భాస్కరరామయ్య, కవురు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు స్వర్ణలత

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ తరుపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా విజయం సాధించిన వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్‌లకు కొవ్వూరు నియోజకవర్గ నాయకులు అభినందనలు తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, రాష్ట్ర ఎంటీసీటీల సంఘం మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయ కులు వరిగేటి సుధాకర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పెరవలి: స్థానిక ఎమ్మెల్సీగా వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేసిన కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ విజయం సాధించడంతో ఆపార్టీ నాయకులు విజయోత్సవం జరుపుకొన్నారు. విజయానికి కారకులైన ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజనీ, పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అభినందనలు తెలిపారు.

ఉండ్రాజవరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాసులను ఏలూరులో గురువారం జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, బీఎస్సార్ యూత్ సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దేవరపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కవురు శ్రీనివాస్‌ను దేవరపల్లి జెడ్పీటీసీ పొట్ట స్వర్ణలత గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు దుర్గారావు దుర్మరణం

హోమ్ మంత్రి తానేటి వనిత సంతాపం



తోట దుర్గారావు (ఫైల్)

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట దుర్గారావు(62) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. దేవరపల్లి నుంచి మోటారు సైకిల్‌పై ఐ.పంగిడి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ తరపున పంచాయతీ మెంబర్‌గా పని చేస్తున్నారు. ఈయన మృతి పట్ల రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుర్గారావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. సర్పంచ్ గోశాల నాగర్జున, ఉప సర్పంచ్ ఉప్పులూరి నానాజీ, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, కామన రత్నాజీ, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, కోమటి కృష్ణంరాజు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు సంతాపం వ్యక్తం చేశారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



కొవ్వూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నిడదవోలు రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. గురువారం వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొవ్వూరు: ఆంధ్రారాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు(నాని) పేర్కొన్నారు. గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో పొట్టి శ్రీరాములు 123వ జయంతిని నిర్వహించారు. ప్రతి ప్రభుత్వ కార్యాయలంలోను పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల జారీ చేయడం శుభ పరిణామం ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దుల సత్యనారాయణ తెలిపారు. మెయిన్ రోడ్డు, ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రాంగణంలో ఉన్న శ్రీరాములు విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పూర్వ అధ్యక్షుడు ఎంబీఎస్ ప్రసాద్ (దత్తుడు), కొల్లేపర శ్రీనివాస్, వలివేటి ప్రసాద్, కాకి అనిల్ సూర్య, వంకాయల శివరామ కృష్ణ, తీగెల రవికుమార్, తుమ్మపల్లి రమేష్, కోట్ల వంశీ, గంధ్రి శేషు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఆరవైశ్యసంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఆర్యవైశ్య, వాసవీక్లబ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కె.సత్యనారాయణ, కోశాధికారి కె.నారాయణ, పట్టణ కిరాణా సంఘం అధ్యక్షుడు బచ్చు సుమన్, వాసవీక్లబ్ అధ్యక్షుడు కె.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పాలంగి గ్రామంలో వాసవీ మాత ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. వాసవీ మాత ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కోల్లేపర సుబ్బారావు సొసైటీ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి, మండల ప్రాథమిక పాఠశాల–1లో ఉన్న పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దమ్మెన్ను పంచాయతీ ఆవరణలో సర్పంచ్ గురజర్ల సత్య నారాయణ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు.

పెరవలి: స్థానిక సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, ముక్కామల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు, అజ్జరం పాఠశాలలో విద్యార్థులు గురువారం పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు.